సీరియల్

రాక్షసహేల

వాణిశ్రీ

(గత సంచిక తరువాయి)

"వాడి పూర్తి పేరు గుర్తులేదు. కంట్రాక్టర్ అనుకుంటాను. కారు మెయింటేన్ చేశాడు. లావుగా, ఎత్తుగా వున్నాడు. ఏవో ప్రాజెక్టులో కంట్రాక్టులు చేస్తున్నానని చెప్పాడు. బామ్మరిదికి కూడా అక్కడే పని ఇప్పిస్తానని అన్నాడు."

"ఏ ప్రాజెక్ట్ భాయ్! కొంచెం గుర్తు తెచ్చుకో." కిరణ్ కి ఆశగా వుంది సత్తార్ కి గుర్తు రావచ్చునని.

సత్తార్ కాసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

"గుర్తొచ్చింది భాయ్! మహాసాగర్ ఆ ప్రాజెక్టు పేరు" అన్నాడు సత్తార్.

"శుక్రియా భాయ్!" అని చెయ్యి కలిపాడు కిరణ్ ఆనందంతో.

మమత లాడ్జికి చేరుకున్నాడు. రిసెప్షన్ లో వున్న మేనేజర్ కిరణ్ ని చూసి విష్ చేశాడు. రూమ్ బాయిస్ కూడా భయంగా చూశారు అతన్ని. చెప్పిన పని శ్రద్ధగా చేశారు.

లంచ్ చేసి కొంచెం సేపు నిద్రపోవాలనుకున్నాడు. ఈ శుభవార్త వెంటనే విజయకు చెప్పాలనిపించింది. నిద్రలేచి కాల్ చేద్దామనుకున్నాడు. కాని మెలకువ

రాలేదు. లేచేసరికి ఆరుగంటలైంది. రూమ్ ఖాళీచేసి బస్‌స్టేషన్‌కి బయల్దేరాడు.

అతని కిప్పుడు చాలా రిలీఫ్‌గా వుంది.

13

మహాసాగర్ మహానదిమీద కడుతున్న డామ్. మేజర్ ప్రాజెక్ట్ కావడంతో ప్రాజెక్ట్ ప్రాంతం దగ్గర టౌన్ వెలసింది. అక్కడ అన్ని ప్రాంతాలవారు వుద్యోగాల్లో వ్యాపారాల్లో వున్నారు.

బావగారి అండలో చేరిన అవతారకృష్ణ మొదట మేస్త్రీగా పనిచేశాడు. కాంట్రాక్ట్సలో మెలకువలు నేర్చుకున్నాడు. థర్డ్‌క్లాస్ కంట్రాక్టరుగా రిజిష్టర్ చేయించుకుని స్వంతంగా పనులు చేపట్టాడు. ఒక్కొక్క మెట్టే ఎక్కి ఇప్పుడు ఫస్ట్‌క్లాస్ కంట్రాక్టరు అయ్యాడు.

పెద్దకొడుకు అమెరికాలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రెండోవాడు మద్రాసులో మెడిసన్, ఏకైక కుమార్తె అక్కడే పదోక్లాసులో వుంది. డామ్‌ప్రాంతంలో షోవలాకాల్టీలో బిల్డింగ్ కట్టుకుని వుంటున్నాడు అవతారకృష్ణ.

కిరణ్ మహాసాగర్ వెళ్ళి వివరాలు సేకరించుకుని వచ్చి విజయకు చెప్పాడు.

ఆమె ఆనందానికి అవధులు లేవు. పట్టరాని సంతోషంతో కిరణ్‌ని కౌగలించుకుని ఒకముద్దు ప్రెజెంట్ చేసింది.

రాత్రి పది దాటింది.

విజయ రోజ్ కలర్ నైటీలో అద్భుతంగా కనిపిస్తోంది. షాంపూ చేసిన కురులు ఫాన్ గాలికి సముద్ర కెరటాల్లా ఎగిసిపడుతున్నాయి. ఆమె కోమలముఖం

చూస్తుంటే అతనికి గతకాలంలో జీవిస్తున్నట్లు, ఆమె ఎవరో రాజకుమారి అని భ్రాంతి కలుగుతోంది. ఆమె శరీరంతో నైటీ కలర్ కలిసి పోయింది. పెదవులు ఎర్ర గులాబీలు విచ్చుకున్నట్లు కనిపిస్తున్నాయి ఆమె మాట్లాడు తుంటే. పల్చటి నైటీలోంచి పాంటీ, బ్రా స్పష్టంగా కనిపిస్తుంటే అతని గుండె లయ తప్పుతోంది.

ఈ అపురూప సౌందర్యరాశి విలువైన యవ్వనాన్ని పగ, ప్రతీకారానికి బలిపెట్టడానికి నిర్ణయించుకోవడం ఎంత బాధగానో వుంది.

విజయ లేచి నిల్చుంది.

అతనూ లేచాడు. ఒక్క అడుగు ముందుకు వేసి ఆమె వదనాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. కళ్ళల్లో కళ్ళు పెట్టి అలా చూస్తూ వుండిపోయాడు అతనికికాలం తెలియడంలేదు.

"కిరణ్ యేమిటలా పిచ్చిగా చూస్తున్నావ్?" అంది ఆమె అతని చేతుల మీద చేతులు వేసి.

"విజయా!"

"వూఁ...."

"మనం పెళ్ళి చేసుకుందాం."

"వద్దు కిరణ్!"

"ఏం?"

"నా పగ తీరిన తర్వాతే పెళ్ళి"

"అంతవరకూ మనం ఇలా ఒకర్నొకరు, చూసు కుంటూ కాలం గడపగలమా? ఎంత భయంకరమైన శిక్ష?"

"తప్పదు కిరణ్. పెళ్ళయితే పిల్లలు పుడతారు. వాళ్ళపై ప్రేమతో పగ, ప్రతీకారం గాలికి ఎగిరి

పోతాయి. నాకు అది ఇష్టంలేదు."

కిరణ్ అనుకున్నాడు.

'పెళ్ళయిపోయి వుంటే ఎంత బాగుండేది?'

విజయ ఒకరిమాట వినే తత్వం గలదికాదు. ఆమెకు నచ్చచెప్పడానికి ప్రయత్నించడం వ్యర్థం.

"కాని విజయా! మనం పెళ్ళి, పెటాకులు లేకుండా ఇలా తిరగడం బాగుంటుందా? లోకం విషయం ప్రక్కన పెట్టు. మీ నాయనమ్మ ఏమనుకుంటుంది?"

"నలుగుర్ని హత్య చేసి ఆ తర్వాత మనం జీవించి వుంటామనే నమ్మకం నీకుందా కిరణ్!"

"అది వేరే సంగతి! నలుగుర్ని వేటాడి చంపడానికి ఎన్నేళ్ళు పడతాయో! అంతవరకు మనం ఎన్నెన్ని వూళ్ళు తిరగాలో, ఎన్ని వేషాలు వెయ్యాలో! మనతో మీ నాయనమ్మని తిప్పడం భావ్యంకాదు. మన ఇద్దరమే తిరుగుతూ వుంటే ఆమె పైకి యేమీ అనలేకపోయినా మనస్సు క్షోభిస్తుంది. బంధు మిత్రుల దృష్టిలో గూడా చీప్ గా వుంటుంది. ఆలోచించు విజయా!"

అతని మాటలు ఆమెలో ఆలోచనలు రేపుతున్నాయి.

"ఆలోచిస్తాను కిరణ్!" అని గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయింది విజయ.

ఆ రాత్రి విజయకు చాలాసేపు నిద్రపట్టలేదు.

కిరణ్ గురించి ఆలోచనలు చెలరేగాయి.

'జీవితానికి కావాల్సింది పగ, ప్రతీకారమేనా?'

తన నిండు యవ్వనం వృథాగా కరిగిపోవాల్సిందేనా?

ఎప్పటికో ఆమె కళ్ళు మూసింది.

మర్నాడు భవానీ దేవితో చెప్పింది.

"అమ్మా! నేను కిరణ్‌ని పెళ్ళి చేసుకుంటాను"

భవానీ దేవి చాలా ఆశ్చర్యం వేసింది. కొద్దిసేపు నిశ్చేష్ట పోయింది. కలా! నిజమా! అని అనుమానపడింది. పెళ్ళిమాట ఎత్తితే మండిపడే మనవరాలేనా ఇలా మాట్లాడింది? పగ, ప్రతీకారం అంటూ మధనపడుతున్న విజయ నిజంగా అంటున్నదా పెళ్ళి చేసుకుంటానని?

"విజయా! నిజంగానే అంటున్నావా?" సంభ్రమాశ్చర్యాలతో ప్రశ్నించింది భవానీదేవి.

"అవునమ్మా!" అంది విజయ తలదించుకుని.

భవానీదేవి ఆనందంతో పొంగిపోతూ మనవరాలిని అమాంతం కౌగలించుకుంది.

పెళ్ళి ఆనందపురంలో వైభవంగా జరిగింది. మద్రాసులో విజయతో పాటు చదువుకున్న క్లాస్‌మేట్స్ కొందరు, హైదరాబాద్‌లో వుద్యోగరీత్యా స్నేహితులైన మరికొందరు పెళ్ళికి వచ్చారు. కిరణ్, బంధుమిత్రులంతా ఆనందపురంలోను, ఆ జిల్లాలోనే ఎక్కువగా వున్నారు. అంతా పెళ్ళికి తరలి వచ్చారు. జమీందారులు లేక పోయినా వాళ్ళ స్థాయిలో ఇప్పటికీ కొందరు వున్నారు అనేంత ఘనంగా పెళ్ళి జరిపించింది భవానీ దేవి.

కోటికి పడగలెత్తిన జమీందారుల కుటుంబంతో కిరణ్‌కి సంబంధం కలవడం బంధువులు కొందరు ఆనందించారు. మరి కొందరు అతని అదృష్టానికి ఈర్ష్యపడ్డారు.

శోభనం రాత్రి కిరణ్ తన్మయత్వంతో చూశాడు విజయను.

అలనాటి రాజకుమారి తనముందు ప్రత్యక్షమైనట్లు భావన కలిగింది.

ఎర్రటి బోర్డరు కలిగిన తెల్లటి పట్టుచీరలో, మల్లెల వాలుజడ, చేతులకు రత్నాల గాజులు, మెడలో రత్నాల హారంతో అపర రతీదేవిలా వుంది విజయ.

ఫ్రెంచి ఫెర్ ఫ్యూమ్ గుబాళింపు, మల్లెల పరిమళంతో కలిసి కలగాపులగంగా వస్తోంది సువాసన.

కిరణ్ ఆమెను కౌగిట్లో బంధించి చాలాసేపు వుండి పోయాడు. అతనికి జన్మ ధన్యమైనట్లు అనిపించింది.

"కిరణ్!"

"వూఁ...."

"నాకొక ప్రామిస్ చెయ్యాలి."

"చెప్పు?"

"మనకి పిల్లలు కలగగూడదు. నువ్వు అందుకు సహకరించాలి. ఈ విషయం వాయనమ్మకు తెలియగూడదు" అంది విజయ.

కిరణ్ ముఖంలో బాధ చోటు చేసుకుంది.

"అలాగే విజయా! నీ మాటే, నామాట" అన్నాడు కిరణ్.

విజయ కళ్ళు సంతృప్తితో మెరిశాయి.

కిరణ్ కళ్ళు బాధతో రెప్పలు వాల్చుకున్నాయి.

14

మహాసాగర్ గెస్ట్ హౌస్ లో దిగారు కిరణ్, విజయ.

కోటారావు చనిపోయాక ఆనందపురంలో పొలాలు, తోటలు నమ్మకంగా చూసేవాళ్ళు ఎవరూ కన్పించలేదు. కోటారావు అన్నదమ్ములు కొందరు అతని పోస్టు కోసం ట్రైచేశారు గాని భవానీదేవి ఎవర్నీ నమ్మలేదు. విజయ పెళ్ళి అయిపోయింది కాబట్టి ఆమెకు దిగులులేదు. రెండు మూడు నెలలకొకసారి వచ్చి కొన్నాళ్ళుంటామని వాళ్ళు

ప్రామిస్ చేసేసరికి ఆనందపురంలోనే వుండిపోవడానికి నిశ్చయించుకుంది.

మర్నాడు ఉదయమే కిరణ్ ఫియట్ కారు డ్రైవ్ చేసుకుంటూ కాలనీలోకి వెళ్ళాడు.

తన టేబుల్లోనుంచి అడ్రస్ వున్న కార్డు తీసిమరొక్కమాటు చూశాడు.

పి. గోవిందరాజులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
డామ్ కన్‌స్ట్రక్షన్ డివిజన్ నెం. 16
క్వార్టర్ నెం. ఇ. ఇ. 33,
రైట్ బాంక్ కాలని,
మహాసాగర్ ప్రాజెక్టు.

దూరం దూరంగా విశాలంగా వున్న క్వార్టర్స్, నెంబర్స్ చూసుకుంటూ వెళ్ళాడు.

క్వార్టర్ నెం. 33 ముందు కారు ఆపి హారన్ కొట్టాడు. వాచ్‌మాన్ మెయిన్ గేటు తీశాడు.

లోపల పోర్టికోలో జీప్ ఆగి వుంది.

డ్రైవర్ జీప్ తుడుస్తూ కనిపించాడు.

కిరణ్ జీప్ వెనుక కారు పార్క్ చేశాడు.

“గోవిందరాజులు గారు వున్నారా?” డ్రైవర్ని అడిగాడు కిరణ్.

“వున్నారు సార్! సైట్‌కి వెళ్ళబోతున్నారు” చెప్పాడు డ్రైవర్.

కిరణ్ తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు. డ్రైవర్ అది ఒక కుర్రాడికిచ్చి లోపలకు పంపించాడు. అతను మరుక్షణంలో తిరిగి వచ్చి “అయ్యగారు రమ్మన్నారు సార్!” అన్నాడు.

ఆఫీసురూమ్‌లో కూర్చున్నాడు గోవిందరాజులు.

"నమస్తే! నేను మోహన్ రాజాల్లాసు తమ్ముడ్ని. కిరణ్ నా పేరు" అని విష్ చేశాడు.

"నమస్తే కూర్చోండి" అన్నాడు గోవిందరాజులు.

కిరణ్ కూర్చొని మోహన్ రాజు ఇచ్చిన కవర్ అందించాడు. అది అతను అన్నగారికి రాసిచ్చిన పరిచయ పత్రం.

గోవిందరాజులు చదువుకున్నాడు.

"వెరీగుడ్! చెప్పండి మీకేం కావాలో?" అన్నాడు.

"ఎమ్. కామ్. పాసయ్యాను. ఐ డోంట్ వాంట్ ఎనీ జాబ్. ఐ వాంట్ టు బీ ఏ బిజినెస్ మాన్" చెప్పాడు కిరణ్.

"వెరీగుడ్! జాబ్‌లో ఏమి వస్తుంది నా బొంద. మీ లాంటి కామర్సు వాళ్ళు బిజినెసులోకే రావాలి."

కిరణ్ మందహాసం చేశాడు.

చంద్రాడు రెండు కాఫీలు తెచ్చి సర్వ్ చేశాడు.

"తీసుకోండి" అన్నాడు గోవిందరాజులు.

కాఫీ తీసుకున్నాక తమ్ముడి క్షేమ సమాచారాలు విచారించాడు.

"చెప్పండి. ఇక్కడ మీరేం బిజినెస్ చెయ్యాలను కుంటున్నారు?"

"కాంట్రాక్ట్స్" చెప్పాడు కిరణ్.

"లోగడ మీకు అనుభవం ఏదైనా వుందా?"

"లేదండీ."

"పెట్టుబడి ఎంత పెట్టగలరు?"

"ఎంత కావాల్సి వుంటుంది?"

"ముందుగా మీరు థర్డ్ క్లాస్ కాంట్రాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చెయ్యాల్సి వుంటుంది."

"ఆ విషయం మీ తమ్ముడు చెప్పాడు."

"ఒక లక్ష వుంటే దర్జాగా చెయ్యొచ్చు."

"పదిలక్షలైనా కాపిటల్ కావాలంటే తీసుకు రాగలను. నాకేమీ ఆస్థిలేదుగాని, మా అత్తగారు బాగా వున్నవారు."

"గుడ్. మీ అత్తగారిది ఏ వూరు?"

"ఆనందపురం. జమీందార్లు వాళ్ళు."

గోవిందరాజులు కళ్ళు మెరిశాయి. కిరణ్ మీద అభిమానం పదింతలు పెరిగింది ఒక్కసారిగా.

"దెన్ నో ప్రాబ్లమ్. నాకు తెలిసిన కంట్రాక్టర్స్ కొందరున్నారు. ఎవరిదగ్గరైనా సబ్ కాంట్రాక్టర్స్ కొన్నాళ్ళు చేసినట్టు మీకు సర్టిఫికేట్స్ ఇప్పిస్తాను. మా డివిజన్లోనే రిజిస్ట్రేషన్ చేయిస్తాను. ఓ.కే."

"థాంక్యూ వెరీమచ్ సార్" చెప్పాడు కిరణ్.

15

జయపూర్ క్లబ్ మహానది ఒడ్డునే ఎకరం స్థలంలో కట్టారు. ప్రాజెక్టు ప్రాంతానికి 'జయపూర్' అని పేరు. ఆ ప్రాంతంలో డామ్ కట్టాలని ఇన్వెస్టిగేట్ చేసి నిర్ణయం తీసుకున్న ఇంజనీర్ జయరావు పేరుమీద టౌన్‌షిప్ వెలిసింది. నది అవతల జయపూర్ సౌత్, ఇవతల జయపూర్ నార్త్.

క్లబ్ జయపూర్ నార్త్‌లో వుంది.

కాలేజీ, హాస్టల్ కూడా నార్త్‌లోనే నిర్మించారు.

నది వుధృతంగా ప్రవహిస్తోంది. క్లబ్ ఫెన్సింగ్ దాటి అలలు లోపలకు చొచ్చుకుని వస్తున్నాయి.

పి.డబ్ల్యు.డి. ఇంజనీర్స్, ఇతర డిపార్టుమెంట్స్‌లో వున్నతాధికారులు సాయంకాలానికి క్లబ్‌కి చేరుకుం

టారు. టెన్నిస్, టెన్నికాయిట్, వటిల్, టేబుల్ టెన్నిస్ కోర్టులేకాక స్విమ్మింగ్ పూల్ గూడా వుంది. రీడింగ్ రూమ్, లైబ్రరీ విభాగాలు గూడా ఏర్పరిచారు.

కిరణ్‌కి టెన్నిస్ ఇంట్రెస్టింగ్ గేమ్. గోవింద రాజులు బిజీగా లేకపోతే టెన్నిస్ ఆడతాడు. డి.యస్పీ అర్జున్ సింగ్, సెక్యూరిటీ ఆఫీసర్, మరికొందరు డాక్టర్స్ రెగ్యులర్‌గా టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తారు.

ఆ రోజు ఆదివారం.

టెన్నిస్ ఆడి కిరణ్ ఛైర్‌లో రిలాక్స్ అవుతున్నాడు. అప్పటికి కిరణ్, విజయ ఆ వూరు వచ్చి రెండు నెలలు అవుతుంది.

గోవిందరాజులు, అవతారకృష్ణ మాట్లాడుకుంటూ వస్తున్నారు. ఈ రెండు నెలల్లోను అతని పరిచయం కాలేదు. కావాలనే పరిచయం చేసుకోలేదు. కాని అతన్ని గురించిన వ్యక్తిగత విషయాలు నెమ్మదిగా సేకరిస్తూనే వున్నాడు.

"మిస్టర్ కిరణ్ మీట్ మిస్టర్ అవతారకృష్ణ!"

గోవిందరాజులు పరిచయం చేశాడు.

"హల్లో! హవా డూ యూ డూ!"

"గ్లాడ్ టూ మీట్ యూ!"

ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు.

అవతారకృష్ణని పరీక్షగా చూశాడు.

నల్లగా లావుగా వున్నాడు. బట్టతల. పొట్ట కుండలా వుంది. గ్లాస్కో పంచె, సిల్కు లాల్చీ, భుజంమీద ఎర్రంచు జెరీ కండువా వేసుకుని హుందాగా వున్నాడు. గోల్డు ఫ్రేమ్ కళ్ళద్దాల్లోంచి చిన్న కళ్ళు లోతుకుపోయి

వున్నాయి. మీసాలు సగం నెరిసి తెలుపు నలుపు కల నేతలా కనిపిస్తున్నాయి. మెడలో పులిగోళ్ళ చైన్ మందంగా చేసి వుంది. అతను స్పోర్ట్స్ ఏమీ ఆడడు. పేకాటకోసం క్లబ్ కి వస్తాడు.

"అవతారకృష్ణగారు 'ఏవన్' కంట్రాక్టర్. మీకు తెలిసే వుంటుంది" అన్నాడు గోవిందరాజులు.

"జయపూర్ లో వీరు తెలియని వారెవరుంటారు? పేరు విన్నాను. ఇప్పుడే పరిచయం" నవ్వుతూ అన్నాడు కిరణ్.

అవతారకృష్ణ నవ్వడం చేతగానివాడిలా మౌనంగా ఉండిపోయాడు. అతను సామాన్యంగా నవ్వడు. ఎప్పుడో చీఫ్ ఇంజనీర్ సైట్ ఇన్ స్పెక్షన్ కి వచ్చినప్పుడో, బిల్స్ పాస్ చేయించుకోవడానికి 'పే' ఆఫీసుకి వెళ్ళినప్పుడో, ప్రియురాలు అలిగినప్పుడో నవ్వుతాడు.

"కిరణ్ మా బ్రదర్ క్లాసు మేట్. జాబ్ చెయ్యడం ఇష్టంలేదు. ఇండిపెండెంట్ గా ఏదైనా చెయ్యాలని కాంట్రాక్టులోకి వచ్చాడు" చెప్పాడు గోవిందరాజులు.

"జాబ్ చేస్తే ఏం మిగులుద్ది నా బొంద. గాజుల బేరం కూటికి సరి అని గతిలేక చెయ్యాలిగాని, బుర్రలో తెలివున్నవాడెవడూ జాబ్ చెయ్యడు. మీవంటి ఇంజనీర్స్, డాక్టర్స్, కలెక్టర్స్ సంగతి వేరనుకోండి" అన్నాడు అవతారకృష్ణ.

"మీరు చెప్పింది సెంట్ పర్సెంట్ కరెక్ట్. అందులోను నాకు మనీ ప్రాబ్లమ్ లేదు" అన్నాడు కిరణ్.

(ఇంకా వుంది)